# కలిసిన గ్రహాల్లో కలవని బ్రతుకులు

యము రాజ్ఞి

అది 2084వ సంవత్సరం మే నెల ఎండలు మండిపోతున్నాయి. ఆకాశంలో "ఇందిరాశాట్‌లైట్" ఉపగ్రహం ఎందు వల్లనో చెడిపోయింది. దాన్ని ట్రాక్ చేసి కరక్ట్ చేయడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నారు ఇంజనీర్లు లేకపోతే అంత రాష్ట్రీయ ఎయిర్‌కూలర్ పనిచేసి ప్రజలు హాయిగా వుండేవారు.

అమితాబ్ కూరగాయల వ్యాపారి. తన ఇంట్లో అల్లుడు "హిహ్యాహిఘుం" అనే శుక్రగ్రహవాసితో గొడవ పడుతున్నాడు.

"మీరు మంచివారని చెప్పి అమ్మాయిని గ్రహంకాని గ్రహంలో యిచ్చినందుకు యిప్పుడు బాధపడుతున్నా! ఇదే. రిపోర్టండి! మీ కిష్టంలేకపోతే ఎల్లుండి లాంచ్‌లో పంపెయ్యండి" అంటూ కోపంతో వూగిపోతున్నాడు అమితాబ్ అతను మాట్లాడే ప్రతిమాట వాళ్ళిద్దరి ముందూ అమర్చివున్న "ఇంటర్ ప్లానెటరీ ట్రాన్సిలేటర్" లోనికి పోయి అతని భాషలో "ఘుం" కు వినబడతోంది.

'ఘు' వినయంగానే అన్నాడు.

"... ... ... ... ... ..." అని.

అమితాబ్ ఆ మాటలు విన్నాడు. కాసేపు ఆగి "ఇదిగో మిస్టర్ 'హిహ్యాహిఘుం', ఇది 2084వ సంవత్సరం మాత్రమే మీగ్రహంలో సంగతివేరు. మేము భాషల విషయంలో మీ అంత ఎదగ లేదు మీరు చెప్పే దుస్తుల్లాంటివి పవిత్ర భూగ్రహంలో పుట్టిన ఏ ఆడదీ ధరించదు. అది ఏ గ్రహమైనా కానీండి!" అన్నాడు. 'ఘుం' బేలముఖం వేశాడు. అతని తలపైని మగసరిని సూచించే నాజూకైన కొమ్ములు విషాదంతో వ్రేలాడాయి.

అమితాబ్ లక్షాధికారి అందుచేతనే గ్రహాంతర వాసికి తన బిడ్డని యివ్వాల్సి వచ్చింది. కూరగాయల వ్యాపారంలో కనుక రోజూ వచ్చే నాలుగువేల రూపాయలూ తిండికే సరిపోవు. ఇక బిలియన్ల కట్నమిచ్చి యిక్కడే ఏవరుణ్ని తేగలడు? అందుకే ఎదురు డబ్బు తీసుకుని శుక్రగ్రహవాసియైన "ఘుం"కు యిచ్చాడు పిల్లని కానీ శుక్రగ్రహంలో అడుగు పెట్టిన నాటి నుండీ "ఘు" పోరు పెడుతూనే వున్నాడు ఆమెకట్టే దుస్తులు వాళ్లకి అవమానమని అవి తీసేసి తనిచ్చేవి కట్టమంటాడు. కానీ తను ఇల్లు వదిలి వచ్చినందుకు తను పుట్టిన గ్రహం పేరు నిలబెట్టాలన్న ధ్యేయంతో ఆ భూగోళ నారి దానికి ససేమిరా అంగీకరించలేదు.

**కూతురు కళ్ళలో నీరు పెల్లుబికింది. "నాన్నా" అంటూ భుజం మీద వాలింది. చాంతాడంత పొడవున్న ఓ గోనే గుడ్డలాంటిది తెచ్చి కట్టుకోమన్నారు. నే నొప్పుకోలేదు. పవిత్ర భూగోళ స్త్రీ ఇంత పెద్ద వస్త్రాన్ని ధరించలేదు.**

ఆ సంగతే యిప్పుడు మామా అల్లుళ్ళు మాట్లాడు కుంటున్నారు.

'ఘుం' వాళ్ల భాషలో అన్నాడు, "సరే! ఇంకా కొన్నాళ్ళు చూసి మాట వినక పోతే పంపేస్తాను మామా!" అన్నాడు తన ఎనిమిది కాళ్లతో పైకి లేస్తూ!

"అలాగే" అన్నాడు మెరుస్తున్న తన తెల్లని వెంట్రుకల్ని సవరిస్తూ అమితాబ్.

* * *

అమితాబ్ వుంటున్న "ఘరకి" అన్ని ఎలక్ట్రానిక్ సదుపాయాలూవున్న పూరిల్లుని "ఘరికి" అందురు) ముందు ఓ నాలుగ్గజాలస్థలముంది అందులో టమేటాలే పండుతాయి దాంట్లో పండే పదిపన్నెండు టమేటాలే అతనికి పంట. ఒక చిన్న సంచిలో ఆ టమేటాల్ని వేసుకుని బయల్దేరాడు అమితాబ్. రహదారిలో కాస్త జనాభా తగ్గిందేమో, అటూ యిటూ వెళ్లే జనాల్ని తీసుకుంటూ మార్కెట్‌కి వెళ్లగలిగేడు. తనకి కనీసం డెభైఏళ్లు వుంటాయి. ఇప్పటికి రెండు సార్లు "ఏజ్ రివైవర్" ఆపరేషన్ చేయించు కొని

నలభైఏళ్లవాడిలా కనపడుతున్నాడు ఇంకెంతో కాలం బ్రతకను, బహుశా ఇంకో రెండు "ఏజ్‌రివైవర్లు" అనుకుని భారంగా ముందు కదిలేడు అమితాబ్ మార్కెట్లో తను తెచ్చిన టమేటాలని. ఒకటి... రెండు... మూడు... అనిలెక్కపెట్టి "ఎలక్ట్రానిక్ సెల్లర్‌లో వేశాడు ఆ వూరి మునిసిపాలిటీలో తనపేరు నమోదు చేయించుకుని "ఎలక్ట్రానిక్ సెల్లర్" తో

తన ఘరకికి కనెక్షన్ యిప్పించుకున్నాడు. అందుకు ఇరవై వేల రూపాయలు సంవత్సరానికి కట్టాలి. టమేటాల్ని వేశాక జనాల్ని తోసుకుంటూ సులభంగానే యిల్లు చేరేడు అమితాబ్ "క్యాష్‌బాక్స్" తెరిచేసరికి పన్నెండు టమేటాలకి పన్నెండు వేలున్నాయి. తృప్తిగా నిట్టూర్చాడు అమితాబ్! ఇంతలో ఘరకి చూరులోంచి కాలింగ్ బెల్ మోత వినిపడింది. వెళ్లి తలుపు తీసేడు. ఎదురుగా సూట్‌కేసు పట్టుకుని కూతురు.

"ఏమైందమ్మా!" అన్నాడు అమితాబ్ ఆశ్చర్యంగా! "వాళ్లు మనుషులు కారు నాన్నా! నన్ను వెళ్లగొట్టేరు. 5 గం లాంచ్‌కి వచ్చేను" అంది.

"పోనీలేమ్మా! బాధపడకు, ఈ శుక్రగ్రహం కాకపోతే మరో జుపిటర్ మెగుళ్ళకేం తక్కువ లేదీ విశ్వంలో! ఇతకీ ఏంజరిగింది"? అంటూ లాలనగా అడిగేడు అమితాబ్.

కూతురు కళ్లల్లో నీరు పెల్లుబికింది. "నాన్నా!" అంటూ భుజం మీద వాలింది. "చాంతాడంత పొడవున్న ఓ గోనెగుడ్డ లాంటిది తెచ్చి కట్టుకోమన్నారు. నేనొప్పుకోలేదు. పవిత్ర భూగోళ స్త్రీ యింత పెద్ద వస్త్రాన్ని ధరించలేదు. ఒకవేళ ధరించినా భరించదు అన్నాను. నాతీకనీ నాకు వుండనివ్వండని బ్రతిమాలాను. అయినా వాళ్లు విన్లేదు బలవంతంగా నాకాగుడ్డ చుట్టబెట్టాలని చూసేరు. ఎదురుతిరిగేను. వాళ్లే కాస్త భయపడి పోయి నన్ను పంపేశారు అంటూ బావురుమంది.

"పోనీలేమ్మా, వాళ్లట్లా చేస్తారని నాకు తెలుసు. అందుకే శనిగ్రహాల వాడొకడితో నీకు కుదిర్చాను.

"హిహ్యా హిఘుం" నన్ను లాంచింగ్ స్టేషనులో రాకెట్ క్యారియర్ ఎక్కించేపుడు ఈ చీటి మీకిమ్మన్నారు నాన్నా!" అంటూ యిచ్చింది ఓ చీటీని! దాన్ని ఇంటర్ ప్లానెటరీ ట్రాన్స్‌లేటర్‌లో పడేశాడు అమితాబ్. తెలుగు అక్షరాలు స్పష్టంగా కనపడ్డాయి అందులో!



"మామా",

మేము ఎన్నో సాధించాము. కానీ గుడ్డలు విడిచి తిరగడం యిప్పటికీ మాకు తప్పే! మీ అమ్మాయిని మీకు అప్పగిస్తున్నా! మరీ అంత గ్రహప్రేమ వుండకూడదు. మీ గ్రహం అభివృద్ధి చెందినా యివిషయంలో మీ గ్రహందే తప్ప కాని మీదికాదు. అందుకే మిమ్మల్ని క్షమిస్తున్నా. త్వరలో యూనివర్సల్ ప్లానెటరీ మారేజెస్ యాక్ట్ క్రింద "కోర్ట్ ఆఫ్ యూనివర్స్" కి విడాకులకి అప్లై చేస్తున్నా! మ్యుచువల్ కన్‌సెంట్ క్రింద సంతకం మీ అమ్మాయితో చేయిస్తారని, కోర్టులహంగామా తప్పిస్తారనీ ఆశిస్తూ....

మీ
"హహ్యాహిఘుం"

ఆ ఉత్తరం చదివిన అమితాబ్ కళ్లలో వేయి అల్ట్రావయొలెట్ హాపీరేస్ మెరిశాయి. అతని కూతురు మాత్రం అప్పుడే శనిగ్రహం వాడితో రాకెట్‌లో షికార్లు తిరుగుతున్నట్లు వూహల్లో తేలిపోతోంది.

* *

ఈ మధ్య ఏ పత్రిక చూసినా సైన్స్ ఫిక్షన్ కన్పిస్తోంది. అవన్నీ చదివాక నాకూ ఓ చిన్నికథ వ్రాయాలని అన్పించింది ఆ ప్రయత్నమే ఈ కథ. —రచయిత్రి